
సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం : సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి పీ చినతమ్మారావు, లతా మల్లేశ్వరి (అల్లూరి జిల్లా) శనివారం రూ.1,01,116 విరాళాన్ని సమర్పించారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 4,700, మధ్య డెల్టాకు 2,200, పశ్చిమ డెల్టాకు ఏడు వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు.

మృత్యుపాశం



చేస్తున్న పనిలో ఎంతో అనుభవం ఉన్నా.. పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించలేకపోయారు.. మృత్యు దేవత తమ తలల పైనే.. విద్యుత్ తీగల రూపంలో 'పాశం' పట్టుకుని కాచుకుని ఉందని తెలుసుకోలేకపోయారు.. ఫలితంగా మూడు నిండు ప్రాణాలు అక్కడికక్కడే గాల్లో కలసిపోయాయి. - 8లో▸

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపులు

రాజమహేంద్రవరం సిటీ: తూర్పుగోదావరి జిల్లా లోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో వి ద్యుత్ బిల్లుల వసూళ్ల కౌంటర్లు ఆదివారం సెలవైనా పని చేస్తాయని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ టీవీఎస్ఎన్ మూర్తి శనివా రం తెలిపారు. ఈ విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో సైతం బిల్లులు చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మసీదులను రాజకీయ వేదికలుగా మార్చొద్దు

టీడీపీ నాయకులపై జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఆరీఫ్ ఆగ్రహం



ప్రకాశం నగర్: మసీదులు, దర్గాలను రాజకీయ వేదికలుగా మార్చవద్దని జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మొహమ్మద్ ఆరీఫ్ అన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన మాజీ సీఎం చంద్రబాబును జైలు నుంచి తప్పించాలని కోరుతూ కొందరు టీడీపీ నాయకులు అల్లాహ్‌ను ప్రార్థించడం విడ్డూరంగా ఉందన్నారు. శనివారం స్థానిక జాంపేటలోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేసిన తప్పులకు చట్ట ప్రకారం చంద్రబాబు జైలుకు వెళ్లారని, అటువంటి ఆర్థిక నేరస్తుడు బయటకు రావాలని కొందరు ముస్లింలు కోరుకోవడం, అంతటితో ఆగకుండా మసీదులు, దర్గాల వద్ద ప్రార్థనలు చేయడం చాలా బాధాకరమన్నారు. ఇటువంటి వారిని ప్రోత్సహించవద్దని ముస్లిం సమాజానికి విజ్ఞప్తి చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో చంద్రబాబు ఎంతో మంది యువకులను మోసం చేశాడని అన్నారు. ప్రధాన నిందితుడిని విచారణ నుంచి తప్పించాలని కోరుకుంటే ఆ అల్లాహ్ కూడా వారిని క్షమించరన్నారు. టీడీపీ నేతల నుంచి సొమ్ము తీసుకుని కొందరు ఇటువంటి తప్పుడు పనులు చేస్తున్నారని, ఎవరు ఎన్ని డ్రామాలు ఆడినా ముస్లిం సమాజం ఎల్లప్పుడూ ముఖ్యమంత్రి జగనన్నకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

నన్నయలో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సు ప్రారంభం

వీసీ ఆచార్య పద్మరాజు



బ్రోచర్ విడుదల చేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీలో ఈ విద్యా సంవత్సరం నుండి ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సును ప్రవేశపెడుతున్నామని వీసీ ఆచార్య కె. పద్మరాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ని శనివారం విడుదల చేశారు. పెరుగుతున్న డిమాండ్‌ని దృష్టిలో పెట్టుకుని యువతకు ఉపాధికి మంచి మార్గంగా ఉంటుందని ఫుడ్ ప్రాసెసింగ్ కోర్సును ప్రవేశపెడుతున్నామన్నారు. ఏపీ పీజీ సెట్‌లో అర్హత సాధించిన వారు ప్రస్తుతం జరుగుతున్న కౌన్సెలింగ్ ద్వారా ఈ కోర్సులో చేరవచ్చన్నారు. ఫుడ్ టెక్నాలజీలోని వివిధ కేటగిరీలకు సంబంధించి ఒక పేపరుతో బీఎస్సీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులు అర్హులన్నారు. కోర్సును పూర్తి స్థాయిలో అమలు చేసేలా మైసూరులోని సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ ఫర్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (సీఎఫ్‌టీఆర్ఐ)తో ఇటీవల ఒప్పందం కూడా కుదిరిందన్నారు. ప్రస్తుతం 20 సీట్లతో ప్రారంభమవుతున్న కోర్సులో ఆసక్తి ఉన్న వారు యూనివర్సిటీ వెబ్‌సైట్ పరిశీలించవచ్చునన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, ఆచార్యులు కెవిరావు, పి. విజయనిర్మల, కె. రమణేశ్వరి, ఎ. మట్టారెడ్డి, బి. జగన్‌మోహన్‌రెడ్డి, కె. దీప్తి, పి. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అపురూప కళకు.. ప్రాణం పోస్తూ..

- నేటికీ సజీవంగా తోలుబొమ్మలాట
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 20కి పైగా బృందాలు
- రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు
- గణపతి నవరాత్ర ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ

సండే స్పెషల్

మండపేట: ఏమయ్యా.. రామయ్యా.. అంటూ దీపపు కాంతిలో చకచకా బొమ్మలు కదలాడుతూంటే.. ఆ బొమ్మలే మాట్లాడుతున్నాయా అన్నట్టుగా వెనుక నుంచి వినిపించే గొంతు.. ఆ గొంతుకు లయబద్ధంగా తాళం వేస్తూ.. హార్మోనియం, డోలక్, చిడతలతో శ్రావ్యమైన సంగీతం.. పూర్వం చూపరులను రేయంతా కట్టిపడేసిన తోలుబొమ్మలాట గూర్చి నేటి తరం వారికి తెలియదనే చెప్పాలి. పురాణేతిహాసాలు, సుప్రసిద్ధ కావ్యాల్లో వర్ణించిన పాత్రల ఆహార్యాన్ని అనుకరిస్తూ మనిషి రూపొందించుకున్న తొలి రంగస్థల కళారూపమే తోలుబొమ్మలాట అని పరిశోధకులు చెబుతారు. ఆ బొమ్మలను స్వయంగా రూపొందించడమే కాకుండా.. తన తెలివితేటలతో రకరకాల విన్యాసాలు చేయించి, వాటి కదలికలకు, సన్నివేశానికి అనుగుణంగా తనకు తెలిసిన భాషతో మాటలు పలికి, పాటలు, పద్యాలు పాడి.. పగలంతా అలసిసొలసిన ప్రజలకు గొప్ప వినోదాన్ని పంచారు ఈ కళాకారులు. నాటి గ్రామీణ జీవితంలో ప్రజల మధ్య ఎంతో ఐక్యతకు, అరమరికలు లేని జీవనానికి, సమాజంలో దుర్మార్గాలపై చైతన్యం పెంచడానికి తోడ్పడిన తోలుబొమ్మలాట భారతీయ జానపద కళారూపాల్లోనే ఎంతో అపురూపమైన కళ. పూర్వకాలం నాటి ఈ కళను ఇప్పటికీ సజీవంగా కాపాడుకుంటూ వస్తున్నారు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పలువురు కళాకారులు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలిస్తూ తమ ఉనికిని చాటుతున్నారు. తోలుబొమ్మలాటకు ఒకప్పుడు గ్రామాల్లో తిరుగులేని ఆదరణ ఉండేది. పండగలు, జాతరలు, ఉత్సవాలు ఏవైనా సరే.. తోలుబొమ్మలాట ఉండి తీరాల్సిందే. రామాయణం, మహాభారతంలోని ఘట్టాలే కథాంశాలుగా తెల్లటి పరదా వెనుక నుంచి తోలుబొమ్మలను ఆడిస్తూ కళాకారులు చేసే ప్రదర్శనను రాత్రంతా ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించేవారు. ఈ కళాకారులు సంచార జీవనం సాగిస్తూ.. ఊరురా ప్రదర్శనలిచ్చి జీవనోపాధి పొందుతూండేవారు. ఒక్కో గ్రామంలో రెండు మూడు వారాల పాటు ఉండి ప్రదర్శనలు ఇచ్చేవారు. పక్క గ్రామాల నుంచి ప్రజలు వచ్చి, తాంబూలం ఇచ్చి, ప్రదర్శన కోసం తమ ఊరికి ఆహ్వానించేంతగా కళాకారులకు పూర్వం మంచి గుర్తింపు ఉండేది. 1980వ దశకం వరకూ ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ కళ సినిమాలు, టీవీలు, సెల్‌ఫోన్ల రాకతో దాదాపు కనుమరుగవుతూ వస్తోంది.



తోలుబొమ్మలాట



మండపేటలో తోలుబొమ్మలాటను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు



తెర వెనుక తోలుబొమ్మలాటను ప్రదర్శిస్తున్న కళాకారులు

సజీవంగా కాపాడుతున్నారు

గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 250కి పైగా తోలుబొమ్మలాట బృందాలు ఉండేవని కళాకారులు తెలిపారు. సినిమాలు, టీవీలు సెల్‌ఫోన్ల రాకతో ఈ కళకు ఆదరణ తగ్గి, జీవనం కష్టమవడంతో చాలా మంది వేరే పనుల్లోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం కాకినాడ జిల్లా కరప, మాధవపట్నం, పెద్దాపురం, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల తదితర ప్రాంతాల్లో 20 వరకూ బృందాలు ఈ కళను ఇప్పటికీ ప్రదర్శిస్తూనే ఉన్నాయి. ఖాళీ రోజుల్లో చిన్నచిన్న చేతివృత్తులు, వ్యాపారాలు చేసుకుంటూ ఉత్సవాలు, పండగల సమయాల్లో ప్రదర్శనలిస్తూ ఈ ప్రాచీన తోలుబొమ్మలాట కళను సజీవంగా కాపాడుకుంటూ వస్తున్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యాన ఆలయాల్లో జరిగే ఉత్సవాల్లోను, పలు ఉత్సవ కమిటీల వారు ఏటా వీరితో ప్రదర్శనలిప్పించి, సత్కరిస్తూ ఈ కళను ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం వినాయక నవరాత్ర ఉత్సవాల సందర్భంగా పలు మండపాల వద్ద తోలుబొమ్మలాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



తోలుబొమ్మలతో కళాకారిణి

ఆకట్టుకునే పాత్రలతో..

- ఒక్కో బృందంలో ఎనిమిది మంది వరకూ సభ్యులు ఉంటారు. ఒకరు సూత్రధారి (ఆర్గనైజర్) కాగా హార్మోనిస్ట్ ఒకరు, డోలక్ వాయించే వారు ఒకరు, తాళం వేసే వారు ఇద్దరు, బొమ్మలు ఆడించేందుకు ఇద్దరు, బొమ్మలు అందించేందుకు ఒకరు ఉంటారు. ఏ కళాకారుడు ఏయే బొమ్మలను ఆడిస్తాడో ఆ పాత్రకు అనుగుణంగా తానే పాడుతూ, పాటకు అనుగుణంగా బొమ్మను ఆడిస్తారు. రెండు బొమ్మలను ఆడించే సమయంలో, వాటి మధ్య వచ్చే పోరాటంలో ఆ రెండింటినీ చేతితో కొట్టిస్తారు. ఆ సమయంలో మిగిలిన వంతదారులు ఆ సన్నివేశానికి అవసరమైన అల్లరి, హంగామా చేస్తారు. యుద్ధఘట్టం వచ్చిందంటే డోలక్‌లు, డబ్బాలూ, ఈలలు, కేకలతో బీభత్స వాతావరణం ఉన్న భ్రమ కలిగిస్తారు.
- కథ ఏదైనా సరే.. తోలుబొమ్మలాటలో కొన్ని పాత్రలు తప్పనిసరిగా ఉంటాయి.
- నాటకాలు, సినిమాలకు దర్శకుని మాదిరిగా తోలుబొమ్మలాటలకు 'సూత్రధారి'ది ప్రధాన బాధ్యత. అతడు కథ వివరంగా, ఆకట్టుకునే మాటలతో చెబుతూంటాడు. పాత్రలకు అనుగుణంగా గొంతు మారుస్తూంటాడు. ప్రేక్షకుల ఆదరణను, విసుగును గమనిస్తూ సమయానుకూలంగా అవసరమైన మార్పులు చేస్తాడు. ఇతర పాత్రలను ప్రవేశపెడతాడు.
- తోలుబొమ్మలాటల్లో జుట్టుపోలిగాడు, బంగారక్క దంపతుల పాత్రలు హాస్యరస ప్రధానమైనవి. తమ హాస్యంతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తూ, నిద్రమత్తు వదలగొడుతూ ఉంటాయి. మధ్యమధ్యలో సమాజంలో దురంతాలపై ఎత్తిపొడుస్తూ, ప్రేక్షకుల్లో చైతన్యాన్ని నింపుతాయి.
- ఇంకా అల్లాటప్పాగాడు, కేతిగాడు వంటి పాత్రలు కూడా తోలుబొమ్మలాటలో ప్రధానమైనవే.

తోలుబొమ్మల తయారీ ఇలా ..

ఈ కళాప్రదర్శనలో ఉపయోగించే తోలు బొమ్మలను మేక, గొర్రె చర్మాలతో తయారు చేస్తారు.

- రామాయణంలోని రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు, సుగ్రీవుడు, రావణాసురుడు తదితర పాత్రలతో పాటు.. మహాభారతంలోని శ్రీకృష్ణుడు, పాండవులు, కౌరవుల బొమ్మలు, హాస్యం పండించే జుట్టు పోలిగాడు, బంగారక్క ఆకారాలను ప్రత్యేకంగా ఆరబెట్టిన పశు చర్మాలపై వేసుకుని వాటికి అవసరమైన రంగులు, హంగులు అద్దుతారు.
- ఆ బొమ్మల కాళ్లు, చేతులు, తల ఆడించేందుకు వీలుగా ఆ భాగాలను విడివిడిగా తయారుచేసి అతికించి, తాళ్లు కడతారు.
- ఒక్కో బొమ్మ తయారీకి 10 నుంచి 15 రోజులు పడుతుంది.
- తెల్లటి వస్త్రాన్ని తెరలా కట్టి, దీపం పెట్టి, ఆ వెలుగులో ఆ బొమ్మలను ఆడిస్తారు.
- హార్మోనియం, డోలక్, చిడతలు వాయిస్తూ ఆయా కథలను సంభాషణలు, పద్యాలు, పాటల రూపంలో వినసొంపుగా వినిపిస్తారు.
- రామాయణంలోని సుందరకాండ, రామరావణ యుద్ధం, లక్ష్మణ మూర్ఛ, సతీ సులోచన, మహాభారతంలోని పద్మవ్యూహం, విరాటపర్వం, భీష్మ పర్వం, దానవీరశూరకర్ణ ఘట్టాలను ప్రదర్శిస్తూంటారు.
- పూర్వం కాగడాల వెలుతురులో తోలుబొమ్మలాట ప్రదర్శించేవారు. ఆ తరువాత ఆముదం, కిరోసిన్, పెట్రోమాక్స్ దీపాల వెలుతురులో ప్రదర్శిస్తూ రాగా.. ప్రస్తుతం విద్యుద్దీపాలు వినియోగిస్తున్నారు. గతంలో రాత్రంతా ఈ ప్రదర్శన ఉండేది. ప్రస్తు తం గంట నుంచి మూడు గంటల వరకూ చేస్తున్నారు.

వారసత్వంగా వస్తున్న కళ



కరపలో నాలుగు బృందాలున్నాయి. వారసత్వంగా వస్తున్న ఈ కళనే నమ్ముకుని రాష్ట్రంలోని పలుచోట్ల ప్రదర్శనలిస్తున్నాం. రెండు రోజుల క్రితం నగరిలో ప్రదర్శన ఇచ్చాం. ఖాళీ రోజుల్లో ఇంటింటికీ తిరిగి గ్యాస్ పొయ్యిలు, గ్రైండర్లు, మిక్సీలు రిపేరు చేస్తూంటాం.
– తోట దావీదు, కళాకారుడు, కరప

ఈ కళను ప్రోత్సహించాలనే..



మండపేట బస్టాండు వద్ద తొలిసారిగా గణపతి నవరాత్ర ఉత్సవాలను ఈ ఏడాది ప్రారంభించాం. ప్రాచీన కళను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో తోలుబొమ్మలాట ప్రదర్శన ఏర్పాటు చేశాం. స్థానికులు, ప్రయాణికులతో పాటు దారిన వెళ్లే వారు కూడా ఆగి ఆసక్తిగా ఈ ప్రదర్శనను తిలకించారు.
– అయినవిల్లి రాజేష్, మండపేట

మహిళా సాధికారతకు నిదర్శనం మార్ట్

జగనన్న మహిళామార్ట్‌ను ప్రారంభించిన ఎంపీ భరత్‌రాం, ఎమ్మెల్యే తలారి



మహిళామార్ట్‌ను పరిశీలిస్తున్న ఎంపీ భరత్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: మహిళాసాధికారతే ధ్యేయంగా ప్రస్తుత ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీ మార్గాని భరత్ రామ్,ఎమ్మెల్యే తలారివెంకట్రావు పేర్కొన్నారు. నల్లజర్లలో మహిళా మార్ట్ ఏర్పాటు చేయడమే ఇందుకు తార్కాణమన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నల్లజర్లలో ఏర్పాటు చేసిన జగనన్న మహిళామార్ట్‌ను శనివారం సాయంత్రం వీరిరువురు ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఆలోచనతో వినూత్న ఆలోచనలతో డ్వాక్రా సంఘాల మహిళలతో మండల కేంద్రాలలో మహిళామార్ట్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి మహిళా లక్షాధికారి కావాలన్నదే తన లక్ష్యమని సీఎం జగన్మోహన్‌రెడ్డి మాటల్లో చెప్పడమే కాదు చేతల్లోనూ చేసి చూపిస్తున్నారన్నారు. అన్నగా తానున్నాంటూ ఆడపడుచుల అభ్యున్నతికి ఆయన సహాయ,సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగి అభివృద్ధి పథంలో పయనించాలన్నారు. ఇప్పటికే ఇళ్లపట్టాలతో పాటు విద్యాదీవెన,చేయూత వంటి పథకాల ఫలాలు మహిళలకు అందజేస్తున్నట్లు చెప్పారు.ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ మార్ట్‌ను దినదినాభివృద్ధి చెందేలా మహిళలంతా ముందుకు తీసుకెళ్ళాలన్నారు.ఏపీఎం విజయనిర్మల కుమారి మాట్లాడుతూ మండలంలోని 2,023 సంఘాలలో 20330మంది సభ్యులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారన్నారు. జిల్లాలో ఇది రెండవ మహిళా మార్ట్ అని వివరించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుభాషిణి, మండలసమాఖ్య అధ్యక్షురాలు కలపాలవరలక్ష్మి,సొసైటీఅధ్యక్షులు కారుమంచి రమేష్,ఎంపీపీ బంక జయలక్ష్మి,జెడ్పీటీసీ ముప్పిడి లక్ష్మి, వైస్ ఎంపీపీలు అచ్యుతశివాజీ,ఆరుగొల్లు మణి,సర్పంచ్ పల్లిజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పెంపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2023 విద్యా సంవత్సరానికి ప్రవేశాల గడువు ఈ నెల 30వ తేదీ వరకూ పొడిగించినట్లు ఆ స్టడీసెంటర్ సమన్వయకర్త ఎంఆర్ గౌతమ్ శనివారం తెలిపారు. విశ్వవిద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఇగ్నోఅడ్మిషన్స్.సమర్థ్.ఎడ్యు.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన కోర్సుల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రాయితీ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఇగ్నో ప్రాంతీయ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

పాఠ్య పుస్తకాల్లో కఠిన అంశాలపై వర్క్‌షాపు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న లెక్చరర్ సూర్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో నాల్గో రోజు శనివారం 8, 9 తరగతుల సాంఘికశాస్త్ర పాఠ్య పుస్తకాల్లో కఠిన అంశాల గుర్తింపుపై వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి మూడు జిల్లాల నుంచి సాంఘిక శాస్త్రం బోధిస్తున్న 80 మంది ఉపాధ్యాయులు హాజరై వివిధ అధ్యాయాలపై చర్చించారు. చివరగా ఎనిమిదో తరగతిలో 24 అధ్యాయాలు, తొమ్మిదో తరగతిలో 20 అధ్యాయాలు కఠినతరమైనవిగా ఉన్నట్లు గుర్తించారు. ఈ వర్క్‌షాపునకు సమన్వయకర్తలుగా కేవీ సూర్యనారాయణ, కె.గంగాధరరావు, ఎన్.ఎస్తేర్ వ్యవహరించారు.

క్లుప్తంగా

'స్థాయీ' సమావేశాల్లో సమస్యలపై చర్చ



స్థాయీ సంఘాల సమావేశాల్లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. 1, 2, 4, 7 స్థాయీ సంఘాల సమావేశాలకు జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మూడో సంఘానికి వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, ఐదో సంఘానికి రొంగల పద్మావతి, ఆరో స్థాయీ సంఘానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షత వహించారు. మహిళలకు 33 1/3 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంటులో ఆమోదించడంపై ప్రధాని నరేంద్ర మోదీ, మద్దతు తెలిపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీలు తదితరులకు జెడ్పీటీసీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా 2025 నాటికి ఇంటింటికీ కుళాయిలు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శ్రీనివాస్ సభ్యులకు వివరించారు. జగనన్న కాలనీలో జల్ జీవన్ మిషన్ పనులు చేపడుతున్నామని, నాలుగు ట్యాంకుల నిర్మాణం పూర్తయ్యిందని, అవసరమైన చోట్ల టెండర్లు పిలిచి కొత్త ట్యాంకులు మంజూరు చేసి, పైపులైన్లు వేస్తున్నామని తెలిపారు. రావులపాలెం, ఉప్పలగుప్తం, రౌతులపూడి జెడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ, ఉపాధి హామీ పనుల విషయంలో ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. ఎంపీడీఓల ద్వారా పనుల మంజూరు వివరాలు తమకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ విప్పర్తిని కోరారు. దీనిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు డెంగీ, మలేరియా, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులను సభ్యులు కోరారు. జిల్లాలో ఇంకా బాగు చేయని రోడ్లకు వెంటనే మరమ్మతులు పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బంది లేకుండా, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా కృషి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. జిల్లాలో 59 పనులకు అనుమతులు వచ్చాయని, అక్టోబర్, నవంబర్ నెలల్లో పనులు ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మృత్యుపాశం

- బోరు మరమ్మతుల్లో అపశ్రుతి
- కరెంటు వైర్లకు తగిలిన ఇనుప స్టాండ్
- ముగ్గురి దుర్మరణం
- మూడు కుటుంబాల్లో విషాదం



మృతులు గల్లా నాగరాజు, కిల్లి నాగేశ్వరరావు, బొదిరెడ్డి సూరిబాబు (పాత చిత్రాలు)

జగ్గంపేట: చేస్తున్న పనిలో ఎంతో అనుభవం ఉన్నా.. పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించలేకపోయారు.. మృత్యుదేవత తమ తలల పైనే.. విద్యుత్ తీగల రూపంలో 'పాశం' పట్టుకుని కాచుకుని ఉందని తెలుసుకోలేకపోయారు.. ఫలితంగా మూడు నిండు ప్రాణాలు అక్కడికక్కడే గాల్లో కలసిపోయాయి. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రాజపూడి గ్రామ శివారు సీతారాంపురం, గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామ సరిహద్దుల్లో జరిగిన ఈ ఘోర సంఘటన మూడు కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది. ఆయా గ్రామస్తులను తీవ్రంగా కలచివేసింది. వివరాలివీ..

సంతర్పణ వేళ..

గణపతి నవరాత్రుల సందర్భంగా సీతారాపురంలో సంతర్పణ ఏర్పాటు చేశారు. గ్రామస్తులంతా ఆ సందడిలో హడావుడిగా ఉన్నారు. గ్రామానికి చెందిన యువ రైతు గల్లా నాగరాజు (25) కూడా అక్కడే ఉన్నాడు. అతడికి ఉప్పలపాడు పరిధిలో పామాయిల్ తోట ఉంది. అందులోని బోరు ఇటీవల పాడైంది. ఈ విషయాన్ని బోర్లు మరమ్మతు చేసే జగ్గంపేటకు చెందిన కిల్లి నాగేశ్వరరావు(41)కు నాగరాజు తెలియజేశాడు. సీతారాంపురంలో సంతర్పణ జరుగుతున్న సమయంలోనే నాగేశ్వరరావు, అతడికి సహాయకుడిగా కిర్లంపూడి మండలం బూరుగుపూడికి చెందిన ఆటో డ్రైవర్ బొదిరెడ్డి సూరిబాబు (40) బోరు మరమ్మతు చేసేందుకు పామాయిల్ తోటకు చేరుకున్నారు. వారు ఫోను చేయడంతో సంతర్పణ హడావుడిలో ఉన్న నాగరాజు.. పొలానికి వెళ్లి గునం ఇచ్చి, ఐదు నిమిషాల్లో వచ్చేస్తానంటూ స్నేహితులకు చెప్పి బయలుదేరాడు.

స్టాండ్ నిలబెడుతూండగా..

నాగరాజు, నాగేశ్వరరావు, సూరిబాబు కలసి పామాయిల్ తోటలో బోరు మరమ్మతు చేసేందుకు వీలుగా మూడు ఇనుప గొట్టాలతో ఉన్న స్టాండ్‌ను నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. సరిగ్గా ఆ స్థలానికి పైనే 11 కేవీ విద్యుత్ వైర్లు ఉన్నాయి. ఈ క్రమంలో ఊహించని విధంగా ఆ విద్యుత్ తీగలకు ఆ ఇనుప గొట్టాలు తగలడంతో ముగ్గురూ ఒక్కసారిగా తీవ్ర విద్యుదాఘాతానికి గురై, అక్కడికక్కడే కుప్పకూలి, మృతి చెందారు. నాగరాజుతో పాటు మరో ఇద్దరు పామాయిల్ తోటలో కరెంట్ షాక్‌తో మృతి చెందారనే సమాచారం కొద్ది నిమిషాల్లోనే తెలియడంతో సీతారాంపురం గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దీంతో సంతర్పణ పనులు వదిలేసి, అందరూ సంఘటన స్థలానికి పరుగు తీశారు. సమాచారం అందుకున్న సీఐ సూర్య అప్పారావు, జగ్గంపేట, గండేపల్లి ఎస్సైలు నాగార్జునరాజు, గణేష్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. వివిధ పార్టీల నేతలు జ్యోతుల నెహ్రూ, పాటంశెట్టి సూర్యచంద్ర తదితరులు అక్కడకు చేరుకుని మృతుల కుటుంబాలను ఓదార్చారు. గండేపల్లి ఎస్సై గణేష్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు సంఘటన స్థలానికి చేరుకుని, బోరున విలపించారు. మృతుడు కిల్లి నాగేశ్వరరావు కుటుంబానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చొరవతో ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం మంజూరు చేసింది. వైఎస్సార్ సీపీ నాయకులు అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

విద్యుత్ వైర్ల కింద ఏవైనా పనులు చేయాలంటే ఆ లైన్లలో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలుపు చేసేందుకు లైన్‌మన్ నుంచి లైన్ క్లియర్ (ఎల్‌సీ) తీసుకోవాలి. అయితే ఈ సంఘటనలో తమ నుంచి ఎల్‌సీ తీసుకోలేదని ఆ శాఖ అధికారులు చెప్పారు. ఎల్‌సీ తీసుకున్నా విద్యుత్ సరఫరా చేయడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందంటూ కొంత మంది అంటున్నారని, అది వాస్తవం కాదని అధికారులు చెప్పారు.



సంఘటన స్థలంలో మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు



సీతారాంపురంలో నాగరాజు ఇంటి వద్ద రోదిస్తున్న బంధువులు



ముగ్గురిని బలి తీసుకున్న విద్యుత్ లైను

తెగిపోయిన ఆధారం

మరో మృతుడు బొదిరెడ్డి సూరిబాబు ఆటో నడుపుతూ, బూరుగుపూడిలో కూరగాయలు మోస్తూ, కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఒక కుమార్తెకు పెళ్లి చేశాడు. మరో కుమార్తె, కుమారుడు చదువుకుంటున్నారు. ఎటువంటి ఆస్తిపాస్తులూ లేవు. సూరిబాబు మృతితో ఆ కుటుంబం జీవనాధారాన్ని కోల్పోయింది.

మృత్యువు పిలిచింది

ఈ ప్రమాదంలో ఇంకో మృతుడు గల్లా నాగరాజు డిగ్రీ వరకూ చదువుకున్నాడు. వ్యవసాయంపై మక్కువ. రెండేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. తండ్రి లేడు. తల్లి, అన్న, అక్క ఉన్నారు. నాగరాజుకు త్వరలోనే వివాహం చేద్దామని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఇంతలోనే అతడి జీవితం అర్ధాంతరంగా ముగిసిపోయింది. గుడి వద్ద ఉన్న నాగరాజును మృత్యువు పిలిచి, తీసుకువెళ్లిందని స్నేహితులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనుభవమున్నా.. మృత్యువుదే పైచేయి

ఈ సంఘటనలో మృతుడు కిల్లి నాగేశ్వరరావు బోర్లు మరమ్మతులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆస్తిపాస్తులేవీ లేవు. ఈ పనుల్లో అతడికి ఎంతో అనుభవం ఉంది. ఎటువంటి పరిస్థితులున్నా చాకచక్యంగా బోర్లు రిపేరు చేయడంలో దిట్ట. కరెంటు వైర్లు ఉన్నప్పటికీ చాలా జాగ్రత్తగా బోరు రిపేరు చేస్తాడని చాలా మంది చెబుతున్నారు. అయితే అతడి అనుభవం కన్నా మృత్యువుదే పైచేయి అయ్యింది. నాగేశ్వరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలు ఇటీవలే డిగ్రీ పూర్తి చేశారు. నాగేశ్వరరావు మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది.

ఏసీబీ వలలో వీఆర్ఓ

- రూ.6 వేల లంచం డిమాండ్
- రైతు నుంచి తీసుకుంటూండగా అరెస్టు



లంచంతో ఏసీబీకి పట్టుబడిన వీఆర్ఓ సూర్యచంద్రరావు

కాజులూరు: కాకినాడ జిల్లా కాజులూరు మండలం బందనపూడి వీఆర్‌ఓ పామర్తి సూర్యచంద్రరావు ఏసీబీ వలలో చిక్కాడు. వివరాలివీ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం చెల్లూరుకు చెందిన తలాటం వెంకటేష్ ఇటీవల బందనపూడిలో 30 సెంట్ల పొలం కొనుగోలు చేసి, పట్టాదారు పాసు పుస్తకానికి దరఖాస్తు చేసుకున్నారు. దాని సంతకం చేయడానికి వీఆర్‌ఓ సూర్యచంద్రరావు రూ.6 వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు రాజమహేంద్రవరం ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అడిషనల్ ఎస్పీ సౌజన్య ఆధ్వర్యాన అధికారులు శనివారం బందనపూడి చేరుకున్నారు. వారి సూచనల ప్రకారం రైతు తలాటం వెంకటేష్ వీఆర్‌ఓ సూర్యచంద్రరావు వద్దకు వెళ్లి డబ్బులు తెచ్చానని, పట్టాదారు పాసు పుస్తకం దరఖాస్తుపై సంతకం చేసి ఇవ్వాలని అడిగారు. ఆర్యావటం గ్రామం కోళ్లతూము సెంటర్ వద్దకు రావాలని ఆ రైతుకు వీఆర్‌ఓ సూచించాడు. తలాటం వెంకటేష్ అక్కడకు వెళ్లి వీఆర్‌ఓ సూర్యచంద్రరావుకు డబ్బులు ఇస్తూండగా హఠాత్తుగా అక్కడకు చేరుకున్న ఏసీబీ అధికారులు అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిని కాజులూరు తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువెళ్లి రెవెన్యూ అధికారుల సమక్షంలో విచారణ చేసి, కోర్టుకు తరలించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే టోల్ ఫ్రీ నంబర్ 14400 లేదా రాజమహేంద్రవరంలోని తమ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ అడిషనల్ ఎస్పీ సౌజన్య తెలిపారు. ఈ దాడిలో ఇన్‌స్పెక్టర్లు వాసుకృష్ణ, బి.శ్రీనివాసరావు, వై.సతీష్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

మందలో ఒక్కడిగా కాదు.. కోటిలో ఒక్కడిగా ఎదగాలి

- మారుతున్న టెక్నాలజీతో పాటు విద్యార్థుల్లో మార్పు రావాలి
- సమాజ అభివృద్ధికి తోడ్పడాలి
- వ్యవస్థలో లోపాలను సవరించాలి
- శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు వరప్రసాద్‌రెడ్డి



వరప్రసాదరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఆదిత్య యాజమాన్యం

గండేపల్లి: మందలో ఒక్కడిగా కాకుండా కోటిలో ఒక్కడిగా ఎదగాలని శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ కేఐ వరప్రసాదరెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఫార్మసీ కళాశాలల ఆధ్వర్యాన రెండు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి సదస్సులో చివరి రోజైన శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేటి వ్యవస్థలో లోపాలను సవరించేందుకు విద్యార్థుల ప్రయత్నం, ఆలోచన విధానాల్లో మార్పు రావాలని అన్నారు. ఆ మార్పు సమాజాభివృద్ధికి తోడ్పడేలా ఉండాలని, విద్యతో పాటు సమాజానికి ఉపయోగపడాలని హితవు పలికారు. ఫొటో, వీడియో, రేడియో, టార్చ్ తదితర సౌకర్యాలతో మన జేబులో ఇమిడిపోయే విధంగా ఆవిష్కృతమైన సెల్‌ఫోన్ నిత్య జీవితంలో ఒక భాగమైందని, అటువంటి ఆవిష్కరణలు చేయగలిగే స్థాయికి ఎదగాలని సూచించారు. 'థింకింగ్ పీపుల్' (ప్రజల గురించి ఆలోచించడం) విధానాన్ని ఎంచుకోవాలని అన్నారు. సమాజానికి మనం ఏం చేస్తున్నాం అనే ఆలోచనతో ముందుకు సాగాలని, సమాజ సేవకు రాజకీయంగా కూడా రాణించవచ్చునని వరప్రసాదరెడ్డి చెప్పారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న కేంద్ర రక్షణ శాఖ సైంటిఫిక్ అడ్వైజర్ జి.సతీష్‌రెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి ఏకే ఖాన్ మాట్లాడుతూ, కష్టపడి చదవడం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థితికి చేరవచ్చని అన్నారు. అనంతరం వరప్రసాదరెడ్డి దంపతులను ఆదిత్య యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఎం.విలియం కారె, హైదరాబాద్ ఐఐసీటీ సీనియర్ సైంటిస్ట్, నైపర్ మొహాలి, మాజీ డైరెక్టర్ ఎ.రఘురాంరావు, ఆదిత్య కళాశాలల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ ఎస్.రామకృష్ణ, కె.రవిశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.